క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల

శామీర్‌పేట్: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శామీర్‌పేట్ మండలం తుర్కపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఈటల టోర్నమెంట్‌ను ప్రారంభించారు. సోదరభావాన్ని పెంపొందించుకోవడంలో క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

సందడిగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని గురుకుల మైదానంలో జనచైతన్య సమితి, వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ బర్ల పద్మమ్మ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. ముఖ్య అతిథిగా ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్ ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కౌన్సిలర్ నర్సింగ్‌రావు, మాజీ వార్డు సభ్యులు దేవేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ రక్షణ అవసరం

కీసర: అంత్య దినాలలో అనేకులు ఆత్మీయ రక్షణ పొందవలసిన అవసరం ఎంతైనా ఉందని చీఫ్ పాస్టర్ అబ్రహాం మాథ్యూ అన్నారు. కీసరలోని టీపీఎం చర్చిలో ఆదివారం జరిగిన పెంతెకొస్తు సువార్త వార్షిక మహాసభలలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ శాంతికి క్రైస్తవుల ఐక్య ప్రార్థనలు కావాలని కోరారు. ఇజ్రాయెల్ క్షేమాన్ని కాంక్షించాలని విజ్ఞప్తి చేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరికీ సేవలు చేసి దేవుని ప్రేమను చాటాలన్నారు. సమావేశానికి వేలాది మంది విచ్చేసి స్వస్థత ప్రార్థనలు చేయించుకున్నారు. అతిథులుగా విజయవాడ సెంటర్ నుంచి పీజీ థామస్, తిరుపతి సెంటర్ నిర్వాహకులు జాయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మెరుగైన ఉపాధి కల్పనే లక్ష్యం

- 10 ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు
- మరో 13 క్యాంటీన్ల ఏర్పాటుకూ చర్యలు
- గ్రామీణ, పట్టణ మహిళా సంఘాల సభ్యులు నిర్వహించేలా చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: మహిళలను లక్షాధికారులను చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకొని చిన్నపాటి వ్యాపారాలు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయటంతో పాటు మహిళా సభ్యులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ.. ఆర్థికంగా వారి కుటుంబాలు ఎదిగేలా చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సర్కారు రుణ సదుపాయాన్ని కల్పిస్తోంది. అందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో పట్టణ పురపాలక సంఘాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏడు మహిళా క్యాంటీన్లు, గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ద్వారా మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పించింది.

- దుండిగల్, బోడుప్పల్‌లో రెండు, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, నాగారం, కంటోన్మెంట్‌సహా బోడుప్పల్‌లో రెండు మహిళా క్యాంటీన్లు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పడగా, కలెక్టరేట్, సచివాలయం, ఎంసీపల్లిలో సెర్ప్ ద్వారా క్యాంటీన్లను మహిళా సంఘాలు ఏర్పాటు చేశాయి.
- జిల్లాలో మరో 13 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మెప్మా ఆధ్వర్యంలో పీర్జాదిగూడ, మేడ్చల్, నిజాంపేటలో సెర్ప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 10 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది.

పట్టణాలు, బస్తీల్లోని మహిళలకు ఉపాధి...

మెప్మా ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 10 మున్సిపల్ సర్కిళ్ల తోసహా 13 పురపాలక సంఘాల్లో రూ. 51 కోట్లతో ఇందిరా మహిళా శక్తి కింద పట్టణ మహిళలకు ఏడు రకాల చిన్నతరహా, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- నిర్మాణ రంగం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ సర్వీస్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యక్తిగతంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు కోసం బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారు.
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటునకు రూ. 10 లక్షల రుణం అందజేయనుంది. ఇందులో 35 శాతం సబ్సిడీ లభించనుంది. పట్టణ మహిళలు చిన్నతరహా, కుటీర పరిశ్రమల స్థాపన కోసం రూ. 3 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు బ్యాంకులు రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటోందని మెప్మా పీడీ అనిల్ తెలిపారు.

సెర్ప్ అధ్వర్యంలో గ్రామీణ మహిళలకు...

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 3,390 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా ఇందులో 36,782 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల కొత్తగా 64 మహిళా గ్రూపులు ఏర్పాటు కావటంతో 775 మంది సభ్యులు చేరారు. మహిళా సంఘాల అర్హతను బట్టి మహిళలకు వారి ఉపాధి కల్పనకు రూ. 50 వేల నుంచి రూ. 10 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించేలా డీఆర్‌డీఏ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మూడు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు కాగా, మరో 10 క్యాంటీన్ల కోసం కసరత్తు చేస్తోంది. అలాగే 250 కోళ్ల పరిశ్రమలు, 16 మీసేవా కేంద్రాలు, 18 కుట్టు మిషన్ కేంద్రాలు, 1697 కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం డీఆర్‌డీఏ అధికార వర్గాలు చర్యలు తీసుకుంటున్నారు.

- ప్రధానంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్ లెట్లు, మిల్క్ పార్లర్స్ ఏర్పాటు చేసేందుకు మండలాల వారీగా డీఆర్‌డీఏ ప్రణాళికలు తయారు చేస్తోంది. ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాంబశివరావు తెలిపారు. అలాగే జ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థులకు కూడా డ్రెస్సులు కుట్టించేందుకు డీఆర్‌డీఏ చర్యలు తీసుకుంటోంది. ఆయా యూనిట్లు నెలకొల్పేందుకు అర్హులైన మహిళా గ్రూపులు, మహిళా సభ్యులను ఎంపిక చేసేందుకు త్వరలోనే ఇంటర్వ్యూలు తదితర కార్యక్రమాలపై డీఆర్‌డీఏ దృష్టి సారించినట్లు అధికార వర్గాలు వెల్లడించారు.



రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



రామలింగేశ్వరస్వామి సేవలో డీసీపీ పద్మజ దంపతులు

కీసర: కీసరగుట్టలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన స్వామివారి అభిషేకంలో డీసీపీ పద్మజ కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గాదేవి మండపంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం డీసీపీ పద్మజను ఆలయ చైర్మన్ నాగలింగం శేషవస్త్రంతో సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కట్ట సుధాకర్‌రెడ్డి, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ శిల్పారామంలో నిర్వహించిన బతుకమ్మ, దసరా సంబరాల్లో భాగంగా శ్రీ సత్యసాయి నృత్య అకాడమీ గురువు చంద్రశేఖర్ శిష్య బృందంచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గజవదన బేడువే, బ్రహ్మాంజలి, వరవీణా, శృంగార లహరి, కామాక్షి, స్తుతి, సరస్వతీ కీర్తన, అష్టలక్ష్మి, చంద్ర చూడ తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన



బీజేపీ సభ్యత్వ నమోదు రసీదులను అందజేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ 8వ వార్డులోని ఎస్వీనగర్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వీనర్ బురజ సంతోషి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ప్రారంభించారు. అనంతరం సభ్యత్వ నమోదు పత్రాలను చైర్మన్ కొకుంట్ల చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు రాయప్రోలు రాఘవ స్వీకరించి రసీదులు అందజేశారు. 300 మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు సంతోషిని తెలిపారు. బీజేపీ నాగారం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శులు రామక్కపేట రవీందర్‌రెడ్డి, మామిడి జంగారెడ్డి, నాయకులు శ్రీరాములు, మల్‌రెడ్డి సతీష్‌రెడ్డి, మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరంగపాణి, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

మల్కాజిగిరి: నియోజకవర్గంలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని బస్ అండ్ ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ కార్యదర్శి నూర్ కేంద్రమంత్రి కృష్ణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గౌతంనగర్, వాజపేయినగర్, ఆల్వాల్ లయోలా కాలేజీ ప్రాంతాల్లో ఆర్‌యూబీ లేదా ఆర్‌ఓబీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మౌలాలి నుంచి సనత్‌నగర్ బైపాస్ లైన్ ఉందని, ఎంఎంటీఎస్ రైళ్ల నిలపడానికి ఆనంద్‌బాగ్, లయోలా వద్ద స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. హైదరాబాద్ డివిజన్‌లో నాలుగు టర్మినల్ పాయింట్స్ మాత్రమే ఉన్నాయని, మల్కాజిగిరి స్టేషన్‌ను అభివృద్ధి చేశారని, కాచిగూడలో రద్దీని తగ్గించేందుకు మల్కాజిగిరిలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపే అవకాశం కల్పించాలని కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గుండ్లపోచంపల్లిలో గౌడవెల్లి విలీనం...
మూడు పార్టీల అధ్యక్ష పోస్టులకు ఎసరు!



రమణారెడ్డి, కాంగ్రెస్



నరేందర్‌రెడ్డి, బీజేపీ



దయానంద్‌యాదవ్, బీఆర్‌ఎస్

మేడ్చల్: మండలంలోని రాజకీయ చైతన్యం అధికంగా గౌడవెల్లి గ్రామం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం కావడంతో మండలంలోని మూడు ప్రధాన పార్టీల మండల అధ్యక్షుల పోస్టులకు ఎసరు వచ్చింది. మండలంలోని గౌడవెల్లికి చెందిన నాయకులే తాజాగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల అధ్యక్షులుగా ఉన్నారు. గౌడవెల్లి గ్రామ పంచాయతీ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం కావడంతో మూడు పార్టీల అధ్యక్షులు తమ పార్టీల పదవులకు నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దయానంద్‌యాదవ్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా, మరో సీనియర్ రమణారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మరో నాయకుడు నరేందర్‌రెడ్డి మండల బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గ్రామానికి చెందిన ముగ్గురు నాయకులు మండల మూడు ప్రధాన పార్టీల అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. గౌడవెల్లి గ్రామం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం కావడంతో ముగ్గురు నాయకులు మండల పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పనిసరిగా తప్పుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి.

తెలంగాణ ఆవిర్భావంలో ఉద్యమకారుల పాత్ర కీలకం



జవహర్‌నగర్‌లో సమావేశమైన తెలంగాణ ఉద్యమకారులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు పిన్నోజు సుధాకర్‌చారి ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమన్నారు. ఉద్యమకారుల భవిష్యత్తు కోసం పోరాడుదామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. అనంతరం ఉద్యమకారులకు ధ్రువీకరణ పత్రం, జ్ఞాపికను అందచేశారు. కార్యక్రమంలో నేతలు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, పరుశురాం, ప్రకాష్, నర్సింహా, మహేష్, ఎల్లస్వామి, సిద్దులు యాదవ్, వెంకటేష్‌గౌడ్, సోమయ్యగౌడ్, బాల్‌నర్సింహా, సిద్దిరాములు, ఎం.ఎస్.చారి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం నూతన కమిటీ



అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం ఆత్మగౌరవం కోసం గత ఆరేళ్లుగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పనిచేస్తుందని ఫోరం సభ్యులు తెలిపారు. ఆదివారం అల్వాల్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన రాష్ట్ర కమిటీ సభ్యులను ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులుగా చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, మీడియా అధికార ప్రతినిధిగా తాడూరి గగన్‌కుమార్, మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా జానకిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వీరస్వామి, ఇందర్‌కుమార్, కోశాధికారిగా జంగా సుదర్శన్, కొండాస్వామి శివకుమార్ నేత ప్రమాణస్వీకారం చేశారు. రాంబాబు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవి అలంకారంలో గాయత్రీమాత



తూంకుంటలో...



గాయత్రీదేవి అలంకరణలో మేడ్చల్ గడి మైసమ్మ

గాయత్రీదేవిగా అమ్మవారు

మేడ్చల్: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజైన ఆదివారం అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మేడ్చల్‌లోని గడి మైసమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రానగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ కట్టమైసమ్మ ఆలయం, అత్వెల్లి చాముండేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గడిమైసమ్మ ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు

తూంకుంటలో మహాలక్ష్మీదేవిగా...

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని గాయత్రి మహాక్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.వి.ఎల్.ఎస్‌మూర్తి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలు కనుల పండుగగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అన్నపూర్ణా దేవిగా...

మేడ్చల్‌రూరల్: పూడూరులో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శ్రీశ్రీ శివ్వంపేట పోచమ్మ, మైసమ్మ దేవాలయంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారికి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనిమచ్చారు.

పోచారం: అన్నోజిగూడలోని గాయత్రీమాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం గాయత్రీ మాతను అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పూడూరులో అన్నపూర్ణ దేవిగా...

కొత్తగా 60 అంగన్‌వాడీ కేంద్రాలు..
30 క్రష్ సెంటర్లు...

- సంక్రాంతి లోగా ప్రారంభించేందుకు సన్నాహాలు
- స్లమ్స్, వెనుకబడిన బస్తీలు, వాడల్లో ఏర్పాటుపై చర్యలు
- బేబీ కేర్ సెంటర్ల మాదిరిగా క్రష్ కేంద్రాలపై కసరత్తు
- మేడ్చల్ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు
- 1.07 లక్షల మంది లబ్ధిదారులు

ప్రభుత్వానికి జిల్లా సంక్షేమశాఖ ప్రతిపాదనలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా 60 అంగన్‌వాడీ కేంద్రాలతోసహా 30 క్రష్ (బేబీ కేర్) కేంద్రాల ఏర్పాటు కోసం సంక్షేమ శాఖ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. వీటికి గ్రీన్ సిగ్నల్ లభించగానే సంక్రాంతిలోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటోంది. కొత్తగా నెలకొల్పనున్న అంగన్‌వాడీ కేంద్రాలతో సహా క్రష్ సెంటర్లను స్లమ్స్ ఏరియాలతోపాటు వెనుకబడిన ప్రాంతాలు, దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న ప్రజలు నివసించే బస్తీలు, గ్రామాలు, వాడల్లో ఏర్పాటు చేసేందుకు జిల్లా సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అంగన్‌వాడీ ప్రాజెక్టుల వారీగా కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, క్రష్ సెంటర్ల ఏర్పాటుపై సర్వే కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు. సంబంధిత లబ్ధిదారులైన గర్భిణులు, పాలిచ్చే తల్లుల తోసహా ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలు, అలాగే, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లలను గుర్తించటంతోపాటు వారి వివరాలతో కూడిన సమాచారాన్ని కూడా నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య కూడా పెరగవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనువైన అంగన్‌వాడీల్లోనే క్రష్ సెంటర్లు...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న క్రష్ (బేబీ కేర్) సెంటర్లను అనువైన అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొల్పేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో సొంతభవనంలో విశాలమైన గదులను కలిగి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రష్ సెంటర్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అప్పుడే చిన్న పిల్లల సంరక్షణ(కేర్) బాగుంటుందని సంబంధిత సంక్షేమ అధికారులు యోచిస్తున్నారు. నిరుపేద,మధ్యతరగతి కుటుంబాల్లో చిన్న పిల్లలను కలిగి ఉన్న భార్యభర్తలు కార్మికులుగా లేదా పరిశ్రమలతోపాటు ఇతరతర ఉద్యోగాలు చేసినప్పుడు వారి సంరక్షణ కోసం క్రష్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడగలవని పేర్కొంటున్నారు.ఈ క్రష్ సెంటర్లలో పిల్లల సంరక్షణ ఉచితంగా ఉంటుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.

గర్భిణీ ,చిన్నపిల్లలకు అంగన్‌వాడీలు కీలకం

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నపిల్లలతోసహా గర్భిణులు, బాలింతల ఎదుగుదలకు ఎంతగానో మేలు చేస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య. ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి నిర్వహణ ఉంటోంది.ఇందులో అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్ల పాత్ర కూడా కీలకంగా ఉంటోంది. ఒకటి నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకవస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వటం, అవి తిన్న తరువాత వండిన పౌష్టికాహారం పెట్టటం వంటి విధులను వారు నిర్వహిస్తారు.పసి పిల్లలు కావడంతో వారి వ్యక్తిగత శుభ్రత విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. కొందరు పిల్లలు రెండుకు వెళ్తే వారిని కడిగి తుడిచి తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు చెమటలు పట్టి ఏడుస్తూ దిక్కులు చూస్తున్నప్పుడు వారిని సముదాయించాల్సిన పనులు కూడా హెల్పర్లు నిర్వహిస్తారు.

793 అంగన్‌వాడీ కేంద్రాలు...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో మొత్తంగా 1,07,484 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ లబ్ధిదారుల్లో 0–6 ఏళ్ల చిన్న పిల్లలు 90,361 మంది ఉండగా, గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉన్నారు.